సాక్షి నిర్మల్

శుక్రవారం । 23 । ఫిబ్రవరి । 2024



పసిడి ధరలు పైపైకి..

ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ మొదలైంది. దీంతో పసిడి ధరలు రోజురోజుకూ పైపైకి పోతుండడంతో మధ్యతరగతి తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు. 8లో▸

వైద్యాధికారి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌ఖిల్లా: భైంసా పట్టణంలోని బస్తీదవాఖాన వైద్యాధికారి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధన్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీబీఎస్ అర్హత కలిగి తెలంగాణ మెడికల్ బోర్డు రిజిస్ట్రేషన్ ఉన్నవారు ఈనెల 26వ తేదీ వరకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగలరని సూచించారు. దరఖాస్తు ఫారం https://nirmal.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని తెలిపారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.1 /19.5

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

• కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ కోరారు. ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో గురువారం సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల కోసం 1,564 బ్యాలెట్ యూనిట్లు, 1,067 కంట్రోల్ యూనిట్లు, 1,322 వీవీప్యాట్‌ల మొదటి దశ తనిఖీ పూర్తిచేశామన్నారు. ఓటరు జాబితాలను రాజకీయ పార్టీలకు అందించామన్నారు. జిల్లాకు అదనంగా కేటాయించిన ఈవీఎంల తనిఖీలు ఈనెల 26 నుంచి చేపడతామని పేర్కొన్నారు. పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని తెలిపారు. నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాలలోని 922 పోలింగ్ కేంద్రాలలో కలిపి మొత్తం 3,79,880 మహిళలు, 3,53,786 పురుషులు, 51 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రావణ్‌రెడ్డి, జగన్‌మోహన్, రవికుమార్, సయ్యద్ హైదర్, గంగ్రత్ రమేశ్, సయ్యద్ మజార్, సిరికొండ రమేశ్, నూతన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గద్దెపైకి సమ్మక్క



సమ్మక్కను గద్దెపైకి తీసుకువస్తున్న దృశ్యం

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ తండాలో బుధవారం ప్రారంభమైన సమ్మక్క సారలమ్మ జాతర కొనసాగుతోంది. గురువారం సమ్మక్కను గద్దెలపైకి తీసుకువచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

• అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



మాట్లాడుతున్న ఫైజాన్ అహ్మద్

నిర్మల్: జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో ఈనెల 29లోపు వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మున్సిపల్ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఎట్టి పరిస్థితుల్లో వందశాతం ఇంటిపన్ను వసూలు లక్ష్యాన్ని పూర్తిచేయాలన్నారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వాణిజ్య సముదాయాల పన్నులు, ఇంటి పన్నులను వసూలు చేయాలని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 29 వరకు పన్ను చెల్లించని యజమానులకు నోటీసులు జారీచేసి, సీజ్ చేయాలని తెలిపారు. మున్సిపాలిటీల వారీగా పన్నుల వసూలుపై చర్చించారు. సమావేశంలో నిర్మల్, భైంసా, ఖానాపూర్ కమిషనర్లు సీవీఎన్.రాజు, వెంకటేశ్వర్‌రావు, మనోహర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


గోదావరి తీరప్రాంతాలను పరిశీలించిన మైనింగ్ ఏడీ



గోదావరి తీరంలో ఇసుకను పరిశీలిస్తున్న మైనింగ్ ఏడీ క్రాంతికుమార్

దస్తురాబాద్: మండలంలోని రాంపూర్, గోడిసీర్యాల, చెన్నూర్ గోదావరి తీరప్రాంతాలను మైనింగ్ ఏడీ క్రాంతికుమార్ గురువారం పరిశీలించారు. ప్రభుత్వ అనుమతులతోనే ఇసుక తరలించాలన్నారు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. మైనింగ్ ఏడీవెంట మండల తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఆర్ఐ గంగన్న ఉన్నారు.

టెంపుల్ టూరిజంపై ఆశలు



• బడ్జెట్‌లో పెట్టిన రాష్ట్ర సర్కారు
• అటవీ ప్రాంతాలపైనా ప్రస్తావన
• బాసర, కదిలి, బాదన్‌కుర్తితో సహా..
• జిల్లావ్యాప్తంగా ఎన్నో ప్రదేశాలు
• హామీలిచ్చి మరిచిన గత ప్రభుత్వం
• ఈసారైనా పట్టించుకోవాలంటున్న జిల్లా వాసులు

నిర్మల్: 'తెలంగాణ రాష్ట్రానికి ఎనలేని వారసత్వ సంపద ఉన్నది. మనం చేయాల్సిందల్లా వాటిని కాపాడి భావితరాలకు అందివ్వడమే. తెలంగాణతల్లి ఒడిలో ఎన్నో అపురూప ప్రదేశాలు ఉన్నాయి. వాటన్నింటినీ పర్యాటక ప్రాంతాలుగా రూపుదిద్దితే భావితరాలు కూడా వాటిని కాపాడుకుంటాయి. ఇంతటి ఘనమైన ఆశయంతో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు నూతన విధానాన్ని రూపొందిస్తున్నాం. దేవాదాయ ధర్మాదాయ శాఖ సహకారంతో టెంపుల్ టూరిజం విధానాన్ని తీసుకువస్తాం..' అంటూ ఈనెల 10న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్రబడ్జెట్‌లో ఆర్థికశాఖమంత్రి భట్టివిక్రమార్క వెల్లడించారు. దీంతో ఎన్నో పర్యాటక అందాలతోపాటు అడుగడుగునా ఆధ్యాత్మిక ప్రదేశాలున్న జిల్లా ఆశలు పెట్టుకుంది. గత ప్రభుత్వం ఇలాగే ఇచ్చిన హామీలను మర్చిపోయింది. ఈసారి మాత్రం అలా కానివ్వొద్దని, పర్యాటకంగా అభివృద్ధి చేయాలని జిల్లాప్రజలు కోరుతున్నారు.

ఆధ్యాత్మిక, పర్యాటక మేళవింపు..

సహ్యాద్రి సానువుల్లో పర్చుకున్న పచ్చని చెట్లు, గలగలాపారే గోదారి అలలు, ఎగిసి పడే జలపాతాలు, చెంగున ఎగిరే వన్యప్రాణులున్న అడవుల జిల్లా ఉమ్మడి ఆదిలాబాద్‌లోకి స్వాగత తోరణంలా ఉంటుంది నిర్మల్ ఖిల్లా. హైదరాబాద్ నుంచి వచ్చే పర్యాటకులకు సాదర స్వాగతం పలుకుతోంది. జిల్లాకు పడమరన, గోదారి ఒడ్డున దేశంలోనే ఏకైక సరస్వతీ క్షేత్రం బాసర ఉంది. పరశురాముడు నడయాడిన ఆనవాళ్లు.. బాసర, దిలావర్‌పూర్‌లో ఇప్పటికీ ఉన్నాయి. దిలావర్‌పూర్ రేణుకాఎల్లమ్మ, కదిలిలో మాతాన్నపూర్ణ సమేత పాపహరేశ్వరుడు ఉన్నారు. ఒకప్పటి మహీషానే ఇప్పటి భైంసా.. నాటి మహీషా ఆనవాళ్లు పట్టణంలో కనిపిస్తాయి. జిల్లా మధ్యన నాలుగు వందల ఏళ్ల నాటి చారిత్రక నిమ్మల కొలువైంది. ఇక్కడి కొయ్యబొమ్మలు, నకాశీలు గీసే చిత్రరాజాలు ఇట్టే ఆకట్టుకుంటాయి. ఇక జిల్లాలో తూర్పు వైపు వస్తే.. పచ్చని అడవులు స్వాగతం పలుకుతాయి. ఖానాపూర్ వద్ద గోదావరిపై అడ్డంగా.. సహజసిద్ధంగా నిర్మించిన సదర్‌మాట్ ఆనకట్ట, మినీ పాపికొండలను తలపించే కడెం ప్రాజెక్టు ప్రకృతి ప్రేమికులను ఆహ్వానిస్తుంటాయి. ఇలా అణువణువునా ఆధ్యాత్మిక, పర్యాటక అందాల మేళవింపు గల స్థలాలు జిల్లా నిండా ఉన్నాయి.

ఎదురుచూస్తున్న బాసర..

వేదాలు, ఉపనిషత్తులు, మహాభారతాన్ని రాసిన వేదవ్యాసుడి చేతుల మీదుగా సరస్వతమ్మ ఇక్కడ ప్రాణం పోసుకుంది. తెలంగాణను సస్యశ్యామలం చేస్తున్న గోదావరి నది నిర్మల్ జిల్లా బాసర వద్దే రాష్ట్రంలోకి అడుగు పెడుతోంది. గోదారి ఒడ్డున పచ్చని చెట్లు, ప్రశాంత వాతావరణంలో గల కోవెలలో చదువుల తల్లి కొలువై ఉంది. ఈ అమ్మ ఒడిలోనే తమ పిల్లలకు అక్షర శ్రీకారాలు చేయిస్తుంటారు. ఇలాంటి ఆలయం దశాబ్దాలుగా అభివృద్ధి కోసం ఎదురుచూస్తోంది. గత ప్రభుత్వం రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామంటు నిధులనిచ్చింది. కానీ.. పనులు మాత్రం చేపట్టలేదు. సదరు నిధులను సైతం కొత్త ప్రభుత్వం ఆపి పెట్టింది. బాసర నుంచి పోచంపాడ్ వరకు గోదావరిలో బోటు ప్రయాణమూ అలాగే నిలిచిపోయింది.

టెంపుల్‌టౌన్ ఆఫ్ తెలంగాణ..

400 ఏళ్ల కిందట నిమ్మనాయుడు నిర్మించిన నగరం నిమ్మల. కాలక్రమంలో నిర్మల్‌గా మారినా.. ఇప్పుడు జిల్లాకేంద్రమైనా.. ఇప్పటికీ ఆనాటి ఆనవాళ్లు చరిత్రకు సాక్ష్యాలమన్నట్లుగా ఠీవిని ప్రదర్శిస్తున్నాయి. ఇక్కడి ఒక్క సర్ద్‌మహల్ చాలు.. నిమ్మల నిర్మాణశైలి ఎంత పక్కాగా ఉందో కళ్లకు కట్టించడానికి. ఇలాంటి ఎన్నో చారిత్రక ప్రదేశాలతోపాటు అడుగడుగునా గుళ్లతో 'టెంపుల్‌టౌన్ ఆఫ్ తెలంగాణ'గానూ నిర్మల్ ప్రసిద్ధికెక్కింది. ఇక్కడ నగరేశ్వర, ఓంకారేశ్వర, కేదారేశ్వర, శివకోటీశ్వర, గుట్ట వీరేశ్వర, రాజరాజేశ్వర, రామన్నగండి తదితర ఆలయాలూ ఉన్నాయి. నిర్మల్‌కు సమీపంలోనే సారంగపూర్ మండలం అటవీప్రాంతంలో అడెల్లి పోచమ్మ ఆలయం, సహ్యాద్రి అందాలను చూపే మహబూబ్ ఘాట్స్ పర్యాటక అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్నాయి. ఈసారైనా మోక్షం కలగుతుందో లేదో చూడాలి మరి.

తూర్పున ఎన్నో..

జిల్లాకు తూర్పు భాగమంతా పచ్చని అడవులు, కడెం, గోదావరి నదులతో ఆకట్టుకుంటుంది. కడెం ప్రాజెక్టు, సదర్మాట్ ఆనకట్టలు ఇప్పటికీ సరైన అభివృద్ధిని నోచుకోవడం లేదు. సదర్మాట్ ఆనకట్ట గోదావరి అందాలను కళ్లకు కట్టి చూపిస్తోంది. కడెం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ పాపికొండలను తలపిస్తుంది. ఇక గౌతమబుద్ధుని శిష్యులు ఉన్న బాదన్‌కుర్తి కూడా ఇక్కడే ఉంది. గోదావరి రెండుగా చీలిపోయిన ప్రాంతంలో బాదన్‌కుర్తి ఉంటుంది. ఇప్పటికీ ఇక్కడ నాటి ఆనవాళ్లు కనిపిస్తాయి. ఈ ప్రాంతాలూ అభివృద్ధిని కోరుకుంటున్నాయి. వీటన్నింటినీ ఆధ్యాత్మిక, పర్యాటకపరంగా అభివృద్ధి చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.

'కదిలే'దెన్నడు..

దిలావర్‌పూర్ మండలంలోని గుట్టపై మాతాన్నపూర్ణ సమేతుడై పాపహరేశ్వరుడు ఇక్కడ కొలువై ఉన్నాడు. ఘాట్ రోడ్డు గుండా సాగే ప్రయాణం ఆకట్టుకుంటుంది. చుట్టూ ఎత్తయిన గుట్టలు, దట్టమైన చెట్ల నడుమ.. లోయలో ఆలయం ఉంటుంది. ఎప్పుడూ ప్రవహించే జీవజలం ఒడ్డున ప్రశాంతంగా కొలువైన కోవెలను ఒక్కసారి దర్శిస్తే మళ్లీమళ్లీ చూడాలనిపిస్తుంది. కానీ.. ఇప్పటికీ ఇక్కడ అభివృద్ధి నామమాత్రంగానే ఉంది. ప్రభుత్వం కాసింత దృష్టిపెడితే ఆధ్యాత్మికతతోపాటు పర్యాటకానందాన్నీ ఆస్వాదింపజేస్తుంది.

పోలీస్ శాఖకు చెడ్డపేరు తెస్తే కఠిన చర్యలు

• ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల



ఎస్పీని సత్కరిస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: పోలీసు శాఖకు చెడ్డ పేరు తీసుకువచ్చే వారు ఎంతటి వారైనా సహించేది లేదని, విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది అంకితభావంతో పనిచేసి ఆదర్శంగా నిలవాలని సూచించారు. నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రిలో యువతితో అసభ్యకరంగా, దురుసుగా వ్యవహరించిన హెడ్‌కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. శాఖాపరమైన చర్యలు కూడా తీసుకున్నామని పేర్కొన్నారు.

ఎస్పీని కలిసిన అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు

అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు ఎస్పీ జానకి షర్మిలను మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని ట్యాంక్‌బండ్ వద్ద బీఆర్.అంబేడ్కర్ విగ్రహం ఎదుట గుట్కా, పాన్పరాగ్, వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిపారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎస్పీని శాలువాతో సత్కరించారు.


లెప్రా సొసైటీ సేవలు అభినందనీయం



కేక్ కట్ చేస్తున్న డీఎంహెచ్‌వో ధనరాజ్

నిర్మల్: కుష్ఠు, క్షయ, ఎయిడ్స్ వంటి వ్యాధుల నివారణకు లెప్రా సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమని డీఎంహెచ్‌వో ధనరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బోధనాస్పత్రిలో గురువారం లెప్రా సొసైటీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. సొసైటీ 35 ఏళ్లుగా అందిస్తున్న సేవలను ఆయన కొనియాడారు. ఈసందర్భంగా కేక్ కట్ చేశారు. ప్రోగ్రాం అధికారి రవీందర్‌రెడ్డి, మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, లెప్రా సొసైటీ ఫిజియోథెరపిస్ట్ కిషన్‌రావు పాల్గొన్నారు.

పాఠకుల చెంతకే గ్రంథాలయం



పొన్కల్‌లోని పబ్లిక్ రీడింగ్ రూం

• గ్రామాల్లో పబ్లిక్ రీడింగ్ సెంటర్లు
• జిల్లా వాప్తంగా 20 కేంద్రాల ఏర్పాటు

మామడ: గ్రంథాలయాలను పాఠకులకు మరింత చేరువ చేసే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతీ మండలంలో ఒకటి, రెండు గ్రామాల్లో పబ్లిక్ రీడింగ్ రూం కమ్యూనిటీ సెంటర్లను ఏర్పాటు చేసింది. గ్రంథాలయాలు మండల కేంద్రాలలో మాత్రమే ఉండటంతోపోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేవారు, పుస్తకాలు, దినపత్రికలు చదివే పాఠకులకు ఇబ్బందిగా ఉండేది. పబ్లిక్ రీడింగ్ రూంల ఏర్పాటుతో గ్రామాలలోని దినపత్రికలు, పుస్తకాలు చదువుకునే అవకాశం కలిగింది. జిల్లా గ్రంథాలయశాఖ అందించిన లక్ష రూపాయల నిధులతో రీడింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలోని 20 రీడింగ్ సెంటర్లకు రూ.50 వేలతో ఫర్నిచర్ అందించారు. ఇందులో పది కేంద్రాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

అందుబాటులో పుస్తకాలు..

గ్రామంలోని విద్యార్థులతోపాటు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికోసం పుస్తకాలు రీడింగ్ సెంటర్‌లో అందుబాటులో ఉంచారు. రీడింగ్ రూమ్ నిర్వహణకు ప్రతీనెల రూ.వెయ్యి అందిస్తున్నారు. దినపత్రికలకు మరో రూ.వెయ్యి వరకు అందిస్తారు.

దినపత్రికలు రాక..

పబ్లిక్ రీడింగ్ కేంద్రాలలో పుస్తకాలతోపాటు దినపత్రికలు అందుబాటులో ఉంచాలి. కొన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నప్పటికీ సగం కేంద్రాలలో దినపత్రికలు రావడం లేదని పాఠకులు పేర్కొంటున్నారు. మామడ మండలం పొన్కల్, దిమ్మదుర్తి గ్రామాలలో రీడింగ్ కేంద్రాలను ప్రారంభించారు. ఈ కేంద్రాలలో పుస్తకాలు ఉన్నప్పటికీ దినపత్రికలు రావడం లేదు. రీడింగ్ కేంద్రాల నిర్వహణ నిధులు గ్రామపంచాయతీ అకౌంట్ ద్వారా అందిస్తారు. కొన్ని కేంద్రాలకు సంబంధించిన వివరాలు అందకపోవడంతో నిధులు అందించడంలో జాప్యం జరుగుతుందని గ్రంథాలయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

దిన పత్రికలు అందుబాటులో ఉంచాలి



మా గ్రామంలో ఏర్పాటు చేసిన రీడింగ్‌రూంకు దినపత్రికలు రావడం లేదు. దినపత్రికలు కేంద్రానికి రాక నోటిఫికేషన్ల వివరాలు, ఇతర సమాచారం తెలుసుకోలేక పోతున్నారు. దినపత్రికలు, యువతకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉంచాలి.

– సుధాకర్‌రెడ్డి, పాఠకుడు, పొన్కల్

అందుబాటులో పుస్తకాలు..



పొన్కల్ గ్రామంలో ఏర్పాటు చేసిన రీడింగ్ రూంలో పుస్తకాలు అందుబాటులో ఉంచాం. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారు, విద్యార్థులు రీడింగ్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దిన పత్రికలకు సంబంధించి నిధులు అందగానే పత్రికలు కేంద్రంలో అందుబాటులో ఉంచుతాం.

– సాయికృష్ణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, పొన్కల్

తాగునీటి సమస్య రాకుండా చూడాలి



బడ్జెట్ ప్రతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్, చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్

• మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే రామారావుపటేల్
• రూ.56.22 కోట్లతో బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదం
• హాజరైన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

భైంసాటౌన్: పట్టణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలతో పూర్తిస్థాయిలో నీరు అందడం లేదని, వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో నీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ సబియాబేగం అధ్యక్షతన 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ఆమోదానికి గురువారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యేతోపాటు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ హాజరయ్యారు. పట్టణంలో మిషన్ భగీరథ పనులపై పలువురు కౌన్సిలర్లు మండిపడ్డారు. ఇష్టారీతిన పనులతో రోడ్లన్నీ అధ్వాన్నంగా మారాయని, ఇప్పటికీ కొన్ని కాలనీల్లో పూర్తిస్థాయిలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. గోపాల్‌నగర్‌లోని వైకుంఠధామం అభివృద్ధి కోసం గతంలో పట్టణ ప్రగతిలో భాగంగా రూ.50 లక్షలతో ప్రతిపాదించగా, మంజూరు కాలేదని కౌన్సిలర్ చందూలాల్ తెలిపారు. నిధులు మంజూరు చేసి వైకుంఠధామం అభివృద్ధి చేయాలని కోరారు. భైంసా–నిర్మల్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కాలనీలకు డ్రెయినేజీ లేకపోవడంతో మురికినీరు రోడ్డుపై పారుతోందని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. ఏడో వార్డు కౌన్సిలర్ అనిత సూత్రావే మాట్లాడుతూ తన వార్డులో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అభివృద్ధికి సహకరించాలని కోరారు. నిర్మల్ చౌరస్తాలో శివాజీ విగ్రహ ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ కపిల్ సింధే కోరారు. సమావేశంలో వైస్‌చైర్మన్ ఎండీ జాబీర్‌అహ్మద్, కౌన్సిలర్లు ఉన్నారు.

రూ.56.22 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం...

అంతకుముందు కమిషనర్ వెంకటేశ్వర్లు 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనా ప్రతులను కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టారు. అనంతరం కౌన్సిల్ సభ్యులకు చదివి వినిపించారు. గతేడాది (2023–24) రూ.15.52 కోట్లతో బడ్జెట్ అంచనాలకు ఆమోదం తెలుపగా, ఇందులో ప్రారంభ నిల్వ రూ.2.26 కోట్లు కాగా, సాధారణ నిధుల ద్వారా ఆదాయం రూ.4.86 కోట్లు, గ్రాంట్స్, రుణం ద్వారా రూ.8.40 కోట్లు చూపారు. వీటిలో రూ.15.47 కోట్లు వ్యయం చేయగా, రూ.7 లక్షలు మిగులు చూపించారు. ఇక, 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను మొత్తం రూ.56.22 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. సాధారణ నిధుల ఆదాయం అంచనా రూ.7.15 కోట్లు, గ్రాంట్స్, రుణం ద్వారా ఆదాయం అంచనా రూ.49 కోట్లు చూపారు. మున్సిపల్ ఆదాయం నుంచి జీతాలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, పారిశుద్ధ్య నిర్వహణ, కరెంట్ బిల్లులు, రుణ వాయిదాల చెల్లింపు, 10 శాతం హరిత హారం పనులకు కేటాయించినట్లు పేర్కొన్నారు. మిగిలిన నిధుల నుంచి 1/3 వంతు అభివృద్ధి చెందని, బలహీనవర్గాలు, మైనార్టీలు నివసించే ప్రాంతాలు, మురికివాడల్లో మౌలిక వసతుల కల్పనకు కేటాయించినట్లు వివరించారు. పార్కులు, వైకుంఠధామాల అభివృద్ధి, ప్రజా మరుగుదొడ్లు, సమీకృత మార్కెట్ అభివృద్ధి, వధశాలలు, డంప్‌యార్డుల నిర్వహణకు కేటాయింపులు చేసినట్లు తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి

• డీఈవో రవీందర్‌రెడ్డి



విజేతలకు బహుమతులు అందిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్‌ఖిల్లా: ప్లాస్టిక్ వినియోగం బాగా తగ్గించాలని, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో గురువారం తెలంగాణ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో ''ప్లాస్టిక్ –ప్రత్యామ్నాయ మార్గాలు'' అనే అంశంపై జిల్లాస్థాయిలో నాటిక, ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ పెనుభూతంగా మారి ప్రపంచానికే సవాల్ విసురుతోందన్నారు. విద్యార్థులను ప్లాస్టిక్ నిర్మూలనపై చైతన్యవంతం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అంతకుముందు జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో దాదాపు 14 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఒక్కోనాటిక పోటీకి ఐదుగురు, ఏకపాత్రాభినయానికి ఒక్కరు చొప్పున మొత్తం 100 మంది పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. డ్రామా పోటీల్లో కేజీబీవీ జామ్– మొదటి బహుమతి, జెడ్పీహెచ్ఎస్ కడ్తాల్– ద్వితీయ బహుమతి, కేజీబీవీ నిర్మల్ అర్బన్ విద్యార్థులు తృతీయ బహుమతి పొందారు. ఏకపాత్రాభినయం పోటీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఈద్‌గాం– మొదటి బహుమతి, కేజీబీవీ నిర్మల్ రూరల్– రెండో బహుమతి, జెడ్పీహెచ్ఎస్ బోసి విద్యార్థులు– తృతీయ బహుమతి సాధించారు. విజేతలకు డీఈవో నగదు బహుమతులు ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతలుగా పర్యావరణవేత్త డాక్టర్ సంపత్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సరిత వ్యవహరించారు. కార్యక్రమంలో ఏసీజీ సిద్ద పద్మ, ఎన్జీసీ ప్రాజెక్ట్ అధికారి బి.విద్యాసాగర్, జిల్లా సమన్వయ కర్త డి.మోహన్‌రావు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవసరానికి సరిపడా విద్యుత్

• ఎస్ఈ జయవంత్‌రావు చౌహాన్

నిర్మల్‌ఖిల్లా: జిల్లా అవసరానికి మించి విద్యుత్ అందుబాటులో ఉందని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ, జిల్లా విద్యుత్ అధికారి జయవంత్‌రావు చౌహాన్ తెలిపారు. విద్యుత్ వినియోగంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇటీవల విద్యుత్ శాఖ ఎస్ఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గురువారం జిల్లాకేంద్రంలో నిర్మల్ డివిజన్ విద్యుత్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. గృహ, వ్యవసాయ వినియోగానికి విద్యుత్ కొరత లేదని, కోతలు ఉండవని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే స్థానిక అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. విద్యుత్ కోతలపై వస్తున్న వదంతులను నమ్మవద్దని తెలిపారు. సమావేశంలో డీఈ నాగరాజు, డీఈ ఎంఆర్టీ శ్రీనివాస్‌రావు, ఏడీఈలు, ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రిపుల్ఐటీ అధ్యాపకునికి డాక్టరేట్


అభినందిస్తున్న డైరెక్టర్ సతీశ్కుమార్

భైంసా(ముధోల్): బాసర ట్రిపుల్ఐటీ అధ్యాపకునికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఫిజిక్స్ డిపార్ట్మెంట్లో అధ్యాపకునిగా పనిచేస్తున్న డాక్టర్ చాంద్రాకేశ్రోషన్కు వరంగల్ ఎన్ఐటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. బాసర ట్రిపుల్ ఐటీ వైస్ చాన్స్లర్ ప్రొఫెసర్ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్కుమార్ అభినందించారు.

సీపీఎం రాష్ట్ర సమావేశాల్లో జిల్లా నేతలు


సమావేశంలో జిల్లా నాయకులు

నిర్మల్: సీపీఎం రాష్ట్రస్థాయి విస్తృత సమావేశాలకు జిల్లా నేతలు హాజరయ్యారు. హైదరాబాద్లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో గురువారం నిర్వహించిన ఈ సమావేశాల్లో పార్టీ పొలిట్బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మార్గదర్శనం చేశారని జిల్లా కార్యదర్శి గౌతమ్కృష్ణ తెలిపారు. రాష్ట్ర, దేశ ప్రయోజనాల కోసం బీజేపీని ఓడించడమే తక్షణ కర్తవ్యంగా తీసుకోవాలని సూచించారన్నారు. జిల్లా నుంచి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్కుమార్, బొమ్మెన సురేశ్, సుజాత పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఖానాపూర్: బీర్నంది పంచాయతీ పరిధిలోని రంగపేటలో గురువారం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. పేకాడుతున్న 9 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 52 పేక ముక్కలతో పాటు రూ.9,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పసిడి ధరలు పైపైకి..

- సామాన్యుడికి అందనంతగా బంగారం
- పెళ్లిళ్ల వేళ మధ్యతరగతి ప్రజానీకం విలవిల


వెలవెలబోతున్న బంగారం వర్తక దుకాణం

నిర్మల్ఖిల్లా: ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ మొదలైంది. వధూవరులతో పాటు వారి తల్లిదండ్రులు, ఇరు కుటుంబాల వారు వివాహాలు ఘనంగా చేయాలని ఆరాటపడుతున్నారు. వారికి బంగారం ధరల సెగ తగులుతోంది. పెళ్లిళ్ల ఖర్చు, వస్త్రాలు, ఫంక్షన్ హాల్, భోజనాలు వీటన్నిటికీ తోడు పెళ్లికూతురు నగలు తయారు చేయించడానికి చేతి చమురు వదిలించుకోవాల్సి వస్తోందని పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. పసిడి ధరలు రోజురోజుకూ పైపైకి పోతుండడంతో తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు. ఇతర ఖర్చులకు తోడు బంగారం ధరలు కూడా ఆకాశాన్ని అంటుతుండడంతో ఆభరణాలు చేయించడానికి జంకుతున్నారు. మంగళసూత్రం, తాళిబొట్టు, చెవి దుద్దులు, ప్రధాన ఉంగరం, గొలుసు వంటివి తప్ప మిగతా అలంకరణకోసం ఉపయోగించే అదనపు ఆభరణాలు చేయించడానికి ఆసక్తి చూపడం లేదు.

తగ్గని పసిడి ధరలతో తంటాలు..

జిల్లా కేంద్రంలోని బంగారు దుకాణాల్లో రోజువారీగా ధరలు బులియన్ మార్కెట్ను అనుసరించి వస్తూ ఉంటాయి. అయితే బంగారం మార్కెట్లో బుధవారం నాటి ధరలు 10 గ్రాములకు రూ.64,600, 12 గ్రాములకు రూ.75,350 ఉన్నా యి. దీనికి తోడు పాదాలకు ధరించే పట్టీలు, గొలుసులు వెండితో తయారు చేయిస్తారు. వెండి ధరలు కూడా కిలోగ్రామ్కు రూ.73,350 ధర పలుకుతోంది. దీంతో సామాన్యులు నగలు చేయించడానికి ఆసక్తి కనబర్చడంలేదని స్వర్ణకారులు అంటున్నారు. గతంలో మాదిరి బంగారు నగలు ఆభరణాలను చేయించుకోవడానికి దిగువ, మధ్యతరగతి కుటుంబీకులు ఇష్టపడడం లేదని వారు పేర్కొంటున్నారు.

గతేడాదితో పోల్చితే బంగారం, వెండి ధరలు ఇలా..

	ఫిబ్రవరి 2023	ఫిబ్రవరి 2024
బంగారం(10 గ్రాములు)	రూ.56,800	రూ. 64,600
బంగారం(12 గ్రాములు)	రూ.66,750	రూ.75,350
వెండి(కిలో)	రూ.63,500	రూ.73,000

ఆభరణాల తయారీకి ఖర్చులు అదనం..

సాధారణంగా ఒక మధ్యతరగతి కుటుంబానికి చెందిన వివాహానికి వధువు కోసం ఆభరణాలు చేయించడానికి కనీసం ఐదుతులాల బంగారం అవసరమవుతుంది. అది కొనడానికి దాదాపు రూ.మూడులక్షల పైచిలుకు డబ్బు కావాల్సి ఉంటుంది. దీనికి తోడు ఆభరణాలు తయారు చేయించడానికి చార్జీలుగా మరో రూ.20 నుంచి రూ.30 వేల వరకు అవుతోంది. మూడు నెలల క్రితానికి ఇప్పటికీ దాదాపు రూ.2,500 పైగా బంగార ధర పెరిగింది. ఇలా నెలల వ్యవధిలోనే బంగారం ధర ఇంతకింతకు పెరిగిపోతుండడంతో సామాన్యులు బంగారు ఆభరణాలను చేయించుకోవడానికి వెనుకంజ వేస్తున్నారు.

మధ్యతరగతి వారికి పెనుభారమే...



బంగారం ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. సామాన్యులు కొనలేని పరిస్థితి. రోజువారి కూలీ చేసుకుని బతికే మాలాంటి మధ్యతరగతి కుటుంబాల వారికి అందని ద్రాక్షగా మారుతోంది.

– దాసరి ప్రవీణ్, సిర్గాపూర్, మం.దిలావర్పూర్

కొనుగోళ్లు బాగా తగ్గాయి



గతేడాదితో పోలిస్తే ఈసారి బంగారం కొనుగోళ్లు బాగా తగ్గాయి. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ అయినా ఆభరణాల తయారీ గిరాకీ అంతంత మాత్రంగానే ఉంది. దీనికి కారణం బంగారం ధరలు అమాంతం పెరగడమే.

– శెట్పెల్లి శివ, స్వర్ణకారుడు, నిర్మల్

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



కడెం: ఈ నెల 20న ప్రారంభమైన అక్కకొండ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి చందన అలంకరణ చేశారు. విష్ణుసహస్రనామ పారాయణం, యాగశాల ద్వారాతోరణపూజ, మూలమంత్రహవనము, నివేదన తీర్థప్రసాదగోష్టి పూజ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

కమనీయం.. గజ్జలమ్మ కల్యాణం



కుంటాల(ముధోల్): కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ కల్యాణం గురువారం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ కనుల పండువగా జరిగింది. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వేద పండితుడు శ్రీ గురుమంచి చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో ఉదయం నిత్యవిధి, యజ్ఞం కార్యక్రమం, హారతి మంత్రపుష్పం, ప్రసాద వితరణ తదితర పూజాది కార్యక్రమాలు, సాయంత్రం రథోత్సవం నిర్వహించారు.



మోదీ హయాంలోనే దేశాభివృద్ధి

- యూపీఏ పాలనలో అనేక కుంభకోణాలు
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్రెడ్డి
- కాగజ్నగర్లో ఎస్పీఎం కార్మికులు, బెంగాలీలతో సమావేశం


మాట్లాడుతున్న కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్రెడ్డి

కాగజ్నగర్రూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్రెడ్డి అన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ పట్టణంలోని ప్రజా కార్యాలయంలో గురువారం సిర్పూర్ పేపర్ మిల్లు(ఎస్పీఎం) కార్మికులతో సమావేశం అయ్యారు. కాగజ్నగర్ మండలంలోని వేదమందిర్ వద్ద బెంగాలీ ప్రజలతో సమావేశమై మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వ పాలనలో 2జీ స్పెక్ట్రమ్, బొగ్గు, కామన్వెల్త్ గేమ్స్ నిర్వహణ, తదితర కుంభకోణాల్లో రూ.12లక్షల కోట్లు పక్కదారి పట్టాయని ఆరోపించారు. అందుకే కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగుచెంది 2014 ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టారని స్పష్టం చేశారు. ఈ పదేళ్లలోనే దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని అన్నారు. మచ్చలేని నాయకుడిగా మోదీ పేరు తెచ్చుకున్నారని, శత్రువు కూడా మెచ్చుకున్న నాయకుడిగా నిలిచారని కొనియాడారు. 370 ఆర్టికల్ రద్దు తర్వాత కశ్మీర్ ప్రజలు స్వేచ్ఛ వాయువులు పీల్చుకుంటున్నారని పేర్కొన్నారు. అక్కడ ఉగ్రవాదం, తీవ్రవాదం, ఐఎస్ఐ దాడులు ఇప్పుడు లేవని తెలిపారు. ఇప్పటికీ కొన్ని పార్టీలు ఓటు బ్యాంకు, కుటుంబ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ఒక్క బీజేపీ మాత్రమే ప్రజాపాలన చేస్తోందన్నారు. దేశంలో జాతీయ రహదారులు, ఉత్పత్తి రంగాల్లో గణనీయమైన మార్పులు రావడంతో ఉపాధి పెరిగిందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా కరోనా వ్యాక్సిన్లు తయారు చేసి దేశ ప్రజలకు ఉచితంగా అందించామని, అలాగే 150 దేశాలకు సరఫరా చేశామన్నారు. సమర్థవంతమైన నాయకత్వంతోనే ఇదంతా సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్బాబు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, ప్రభారి రాజమౌళి, కల్లోల భట్టాచార్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు వెంకటేశం, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

బాలికను వేధించిన కేసులో ఏడాది జైలు

నిర్మల్టౌన్: బాలికను వేధించిన కేసులో ఒకరికి నిర్మల్ కోర్టు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన బాలిక ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. శాంతినగర్కు చెందిన కొండల్వాడ్ బాబా షాదుల్లా నిన్ను ప్రేమిస్తున్నానంటూ వెంటపడి వేధించేవాడు. 2018, ఫిబ్రవరి 15న బాలిక తండ్రితో కలిసి స్కూటీపై వెళ్తుండగా ఆపి మీ అమ్మాయిని ప్రేమిస్తున్నానని, అడ్డు వస్తే చంపుతానని బెదిరించాడు. దీంతో అమ్మాయి తండ్రి నిర్మల్ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సైలు బాలకృష్ణ, ఉషన్న కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారావు 11 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశారు. నిందితునికి ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా పోక్సో కోర్టు ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ గురువారం తీర్పునిచ్చారు.

స్ట్రెస్ మేనేజ్మెంట్పై శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధన్రాజ్

నిర్మల్ఖిల్లా: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో స్ట్రెస్ మేనేజ్మెంట్పై ఆరోగ్య సహాయకులకు గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధన్రాజ్ మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో ఎదురు అయ్యే స్ట్రెస్ను ఎలా అధిగమించాలి, స్ట్రెస్తో కలిగే నష్టాలను వివరించారు. శిక్షణ తీసుకున్న ఆరోగ్య సహాయకులు అందరూ జిల్లాలోని ఆయా పాఠశాలలను సందర్శించి అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు, ఒత్తిడి లక్షణాల గురించి, దానిని అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యల, స్ట్రెస్ మేనేజ్మెంట్ పద్ధతుల గురించి సైకియాట్రిస్ట్ డాక్టర్ సురేష్ వివరించారు. శిక్షణ కార్యక్రమంలో అధికారులు డాక్టర్ నయన రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, జిల్లాలోని ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

25న సీఓఈ సెకండ్ స్క్రీనింగ్ టెస్ట్

- ఆదిలాబాద్ రీజియన్లో నాలుగు పరీక్ష కేంద్రాలు
- గురుకుల వెబ్సైట్లో హాల్ టికెట్లు

బెల్లంపల్లి: సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) కళాశాలల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈ నెల 25న సెకండ్స్క్రీనింగ్ టెస్ట్ జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 4న నిర్వహించిన మొదటి విడత ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను రెండో విడత పరీక్ష రాయడానికి అవకాశం కల్పించారు. సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ వెబ్సైట్ నుంచి హాల్టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి, బెల్లంపల్లి సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ సైదులు తెలిపారు. బాలబాలికల కోసం రీజియన్ పరిధిలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, లక్సెట్టిపేట, చెన్నూర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుంది. విద్యార్థులకు డిస్క్రిప్టివ్ పద్ధతిలో పరీక్ష నిర్వహిస్తారు. అనుమానాల నివృత్తి, ఇతర వివరాల కోసం 9948714105 నంబరులో సంప్రదించాలని సూచించారు.

అలరించిన కుస్తీ పోటీలు


కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

కుభీర్(ముధోల్): మండలంలోని రంజని గ్రామంలో మూడు రోజులుగా మహాలక్ష్మీ జాతర కొనసాగుతోంది. ఇందులో భాగంగా గురువారం అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ హాజరై పోటీలను తిలకించారు. పోటీలలో మహారాష్ట్రలోని పలుగ్రామాల మల్లయోధులతో పాటు మండలంలోని పలుగ్రామాల మల్లయోధులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి రూ.5వేలు మహారాష్ట్రలోని బిద్రెల్లికి చెందిన సాయినాథ్ గెలుచుకున్నారు.

గజ్జలమ్మ తల్లి ఆడియో ఆవిష్కరణ


ఆడియో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు, నృత్య కళాకారుడు, రచయిత మ్యాజిగె రవి రూపొందించిన గజ్జలమ్మ తల్లి ఆడియోను గురువారం రాత్రి ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ గజ్జలమ్మ ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. కవులను, కళాకారులను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, ఎంపీటీసీ సుధాకర్, కోఆప్షన్ సభ్యుడు గౌస్, కవులు సత్యానందపు గడ్డపు గజ్జారాం, తాటి శివ, మహేందర్, గాయని తోకల నర్మద, జీవీ.రమణారావు, ఎస్.రమేష్, పిప్పెర వెంగళరావు, పసుల నవీన్ గంగయ్య, కె.రమణారావు, బోగ గోవర్ధన్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభిరుచులను ప్రోత్సహించాలి



క్రీడా దినోత్సవ వేడుకల్లో విద్యార్థులతో జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్రెడ్డి

నిర్మల్ఖిల్లా: విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా తల్లిదండ్రులే వారిని ప్రోత్సహించాలని డీఈవో రవీందర్రెడ్డి సూచించారు. జిల్లాకేంద్రంలోని జేవీఎస్ఆర్ పాఠశాలలో క్రీడాదినోత్సవం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈవో హాజరై మాట్లాడారు. విద్యార్థుల మానసిక, శారీరక మానసిక వికాసంలో తల్లిదండ్రులపాత్ర కీలకమని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉన్న అభిరుచులను, అంతర్గత నైపుణ్యాలకు గుర్తించి తదనుగుణంగా వారిని తీర్చిదిద్దాలని సూచించారు. చిన్నారులు తమ ప్రతిభను ప్రదర్శించినపుడు కుటుంబ సభ్యులు ఇచ్చే చిన్నప్రశంస వారిలో అంతర్గతంగా ఉత్తేజం నింపుతుందన్నారు. చిన్నారులు మన కుటుంబ గౌరవాన్ని సమాజంలోకి తీసుకెళ్లే ప్రతినిధులుగా తయారుచేయాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్కు ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు. విద్యార్థుల్లో ఈ నైపుణ్యాలను పెంపొందించాలని కోరారు. ఒత్తిడిని జయించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని అన్నారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేవీఎస్ఆర్ పాఠశాల ఎగ్జిబిషన్ సొసైటీ చైర్మన్ కె.శ్యాంసుందర్, సెక్రెటరీ వనం సురేందర్, కోశాధికారి మంజీత్రెడ్డి, ప్రిన్సిపాల్ మణికుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

తోటి విద్యార్థిపై కత్తితో దాడికి యత్నం

- కప్పిపుచ్చడానికి సిబ్బంది యత్నం
- విచారణ చేపట్టిన డీఈవో ప్రణీత

గుడిహత్నూర్(బోథ్): మండలంలోని మన్నూర్ జెడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థి తోటి విద్యార్థిపై కత్తితో దాడికి యత్నించిన ఘటన చోటు చేసుకుంది. డీఈవో విచారణతో విషయం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన ఇద్దరు కవలలు ఒకరు 9వ తరగతి, మరొకరు 8వ తరగతి చదువుకుంటున్నారు. 8వ తరగతి చదుకుంటున్న విద్యార్థి అదే తరగతిలో చదువుకుంటున్న బాలికను రెండు రోజులుగా వేధింపులకు గురిచేస్తున్నాడు. బాలిక విషయాన్ని పదోతరగతిలో చదువుకుంటున్న తన అన్నకు చెప్పడంతో సదరు విద్యార్థిని కొట్టాడు. దీంతో ఈ విషయాన్ని ఆ విద్యార్థి 9వ తరగతిలో ఉన్న తన అన్నకు తెలిపాడు. దీంతో అతను కూరగాయలు కోసే కత్తి తీసుకొచ్చి బాలిక అన్నతో గొడవ పడ్డాడు. ఉపాధ్యాయులు మందలించడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం ఉపాధ్యాయులు గ్రామ పెద్దలను పిలిపించి విద్యార్థుల తీరును వివరించారు. విషయం తెలుసుకున్న డీఈవో ప్రణీత హుటాహుటిన పాఠశాలకు చేరుకొని విచారణ జరిపారు. బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది.

సంకల్పయాత్ర విజయవంతం

నిర్మల్: ప్రజల్లో బీజేపీకి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని, కుమురంభీమ్ క్లస్టర్లో భాగంగా జిల్లాలో చేపట్టిన విజయసంకల్పయాత్ర విజయవంతమైందని యాత్ర సహప్రముఖ్ రావుల రాంనాథ్ తెలిపారు. జిల్లాలోని బాసర, భైంసా, కల్లూరు నర్సాపూర్, దిలావర్పూర్, నిర్మల్లో యాత్ర రోడ్షో, కార్నర్మీటింగ్లు విజయవంతం అయ్యాయని వివరించారు. ఈ యాత్రతో ప్రజల్లో మోదీపై ఉన్న ఆదరణ వెల్లడైందని, రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. విజయసంకల్పయాత్రను విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అలేఖ్య కుటుంబానికి న్యాయం చేయాలి

- ఎస్పీకి అఖిలపక్షం నేతల వినతి


ఎస్పీని కలిసి విన్నవిస్తున్న అఖిలపక్షం నేతలు

ఖానాపూర్: ఇటీవల ఖానాపూర్ పట్టణంలో ప్రేమోన్మాది శ్రీకాంత్ చేతిలో హత్యకు గురైన అలేఖ్య కుటుంబాన్ని ఆదుకోవడంతోపాటు నిందితుడికి కఠిన శిక్షపడేలా చూడాలని అఖిలపక్షం నాయకులు కోరారు. అలేఖ్య కుటుంబీకులతోపాటు దాడిలో తీవ్రంగా గాయపడ్డ మరో యువతి జయశీలతో కలిసి గురువారం ఎస్పీ జానకి షర్మిలను కలిశారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన ఖానాపూర్లో వెలుగు చూసిన విషసంస్కృతిని ఇంతటితో నిలిచిపోయేలా నిందితులకు కఠిన శిక్షపడాలన్నారు. తీవ్ర గాయాలతో ఉన్న జయశీలతోపాటు ఆమె కుమారుడు రియాన్స్ను ఎస్పీ ఓదార్చి ధైర్యం చెప్పారు. కేసు విచారణ వేగవంతం చేసేలా ఫాస్ట్ట్రాక్ కోర్టు ఏర్పాటు కోసం పోలీస్ శాఖ తరపున ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఎస్పీని కలిసినవారిలో నంది రామయ్య, కె.రాజన్న, జన్నారపు శంకర్, నాగెల్లి నర్సయ్య, ప్రణీత్, వెంకటస్వామి, మోహన్, రాకేశ్, పురుషోత్తం, రామ్లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

చోరీకి గురైన బైక్లు స్వాధీనం

ఆదిలాబాద్టౌన్: ఇటీవల చోరీకి గురైన రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్సై రమణారెడ్డి తెలిపారు. జైనథ్ మండలంలోని జామ్నికి చెందిన ఖండేష్కర్ గౌతమ్ ఈ నెల 18న రిమ్స్ ఎమర్జెన్సీ వార్డు ముందు బైక్ను పార్క్ చేసి ఆస్పత్రి లోనికి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి బైక్ మాయమైంది. పట్టణంలోని శ్రీరాం కాలనీకి చెందిన పీసర రమేశ్ బాలాజీ ఆస్పత్రిలో కంపౌండర్గా పనిచేస్తున్నాడు. రోజులాగే ఆస్పత్రి ఎదుట బైక్ పార్క్ చేశాడు. గంట తర్వాత తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించకుండా పోయింది. వీరిద్దరూ టూటౌన్లో ఫిర్యాదు చేశారు. గురువారం తాంసి బస్టాండ్ ప్రాంతంలో మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా మాండకు చెందిన డొడెవార్ రాజేశ్వర్ చోరీకి గురైన వాహనంపై తిరుగుతుండగా వాహనాల తనిఖీల్లో భాగంగా అనుమానం వచ్చిన పోలీసులు ఆయనను విచారించారు. దీంతో చోరీకి గురైన మరో బైక్ను రైల్వే స్టేషన్ సమీపంలో దాచిపెట్టినట్లు తెలిపాడు. ఆ రెండు బైక్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితుడిని అరెస్టు చేసినట్లు వివరించారు.

ఇసుక చోరీ చేస్తున్న ఒకరి అరెస్టు

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్లో మైనింగ్, రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుక అక్రమంగా చోరీ చేస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. సుమారు రూ. 2 వేల విలువైన ఇసుకను దొంగతనంగా తరలిస్తున్నారని కాపలాదారు అయిన వీఆర్ఏ జాడి గంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.